క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

తాండూరు రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు రూ.4.85కోట్లతో బొంకూరు–బిజ్వార్ బ్రిడ్జి పనులు, ఖాంజాపూర్ వాగు వద్ద రూ.7.67కోట్లతో చెక్‌డ్యాం పనులకు శంకుస్థాపన చేస్తారని వివరించారు. అనంతరం మధ్యాహ్నం 2గంటల తర్వాత చంద్రవంచ శివారులోని కాగ్నానది వద్ద రూ.8.74 కోట్లతో చెక్‌డ్యాం పనులు, ఎల్మకన్నెలో రూర్బన్ పథకం కింద పూర్తయిన మీ సేవా, హెల్త్ సెంటర్లను ప్రారంభిస్తారని చెప్పారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవతం చేయాలని కోరారు.

20న మాలల గర్జన

కుల్కచర్ల: మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న మాలల గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు తలారి విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం చౌడాపూర్ పరిధిలోని మరికల్ గ్రామంలో స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పరిగి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న మహా సభకు మాల కులస్తులంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, నర్సింలు, బ్యాగరి వెంకటేశ్, రాములు, శ్రీను, రమేశ్, చందు, రాజు, అంజయ్య, ప్రసాద్, సుదర్శన్, నాని, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలిగా పల్లవి



అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం వికారాబాద్ పట్టణ అధ్యక్షురాలిగా వికారాబాద్‌కు చెందిన సి.పల్లవిశివానందం నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. మహిళా విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన మాజీ మంత్రి ప్రసాద్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఇతర సీనియర్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల చూపు కాంగ్రెస్ వైపు

మాజీ ఎంపీపీ మల్లయ్య



ఎన్కేపల్లిలో గ్యారెంటీ పథకాలపై కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మోమిన్‌పేట: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాల వైపే ప్రజలంతా చూస్తున్నారని మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎన్కేపల్లి, మోమిన్‌పేట, దేవరంపల్లి గ్రామలలో పార్టీ నాయకులతో కలిసి ఆరు గ్యారెంటీ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలనలో విసుగెత్తిన ప్రజలు కాంగ్రెస్‌వైపు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బాగ్దాద్, సీనియర్ నాయకులు సురేందర్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజోద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాస్ పటేల్, మండల ఉపాధ్యక్షుడు హాజీ, నాయకులు చంద్రయ్య గౌడ్, అనిల్, విద్యాసాగర్, వాజిద్, తాజ్, ఖలీల్, మోసిన్, తౌఫిక్ తదితరులు ఉన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మధుసూదన్‌రావు

కొడంగల్: పట్టణంలోని 2వ వార్డులో ఆదివారం కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్ చీరలు పంపిణీ చేశారు. తెలంగ్‌వాడీ బాలాజీనగర్ బ్రాహ్మణవాడ కాలనీలకు చెందిన మహిళలు చీరలు అందుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. బతుకమ్మ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించాలని కోరారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొడంగల్ అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.

పేదలకు అండగా టీడీపీ

పార్టీ రాష్ట్ర నాయకుడు బాల ముకుందం

కుల్కచర్ల: పేదలకు టీడీపీ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర నాయకుడు బాల ముకుందం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పుట్టపహాడ్‌కు చెందిన కరిగళ్ల మొగులమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ వారికి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చరూ..



రైతు బజార్ సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు

మున్సిపల్ పరిధిలోని పలు వీధుల్లో రోడ్లు గత నెల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు, పాఠశాలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వినాయక నిమజ్జనాల సందర్భంగా ఆయా మార్గాల్లో గుంతల్లో డస్ట్ పోయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అన్ని వార్డుల్లో పరిస్థితిని అంచనా వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– వికారాబాద్ అర్బన్

ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయండి

104 సిబ్బంది ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుకారాం

అనంతగిరి: గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్ల నుంచి వైద్య సేవలు అందిస్తున్న 104 ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తుకారాం ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట 104 ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, 104 జిల్లా నాయకులు రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్, వినోద, రఘు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న 104 సిబ్బంది

కాంగ్రెస్ కార్యాలయాలు ప్రారంభం

కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని మద్దూరు, నందిపాడు, లక్కాయపల్లి గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలను మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ప్రారంభించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని గెలిపించాలని ఆయా గ్రామాల ప్రజలను కోరారు. మద్దూరు కాంగ్రెస్ మండల పార్టీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సైకాలజిస్టు డాక్టర్ లక్ష్మణ్ పాల్గొని కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరుపతిరెడ్డికి తమ సమస్యలు వివరిస్తున్న మహిళలు

టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలి

ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు చంద్రశేఖర్ ముదిరాజ్

దోమ: చట్టసభల్లో ముదిరాజ్‌లకు అవకాశాలు కల్పించాలని సంఘం గ్రామ అధ్యక్షుడు బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని బొంపల్లి గ్రామం నుంచి నగరంలోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ముదిరాజుల ఆత్మగౌరవ సభకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల్లో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లను ఓటు బ్యాంక్‌గా చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవుల్లోనూ తమకు అన్యాయం జరుగుతోందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్ కులస్తులకు 20 అసెంబ్లీ మూడు పార్లమెంట్ స్థానాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ ప్రధానకార్యదర్శి యాదయ్య, సంఘం నేతలు రాములు, నర్సింహులు, రాజు, రమేశ్, డాక్టర్ రాజు, నవీన్, శ్రీనివాస్, బాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: చౌడాపూర్ నుంచి ముదిరాజ్ గర్జనకు వెళ్తున్న సంఘం నాయకులు

సంఘం నాయకులు సంఘటితమవ్వాలి

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు, నాయకులు నగరంలోని పరేడ్‌గ్రౌండ్‌లో ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు సంఘం నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులంతా పార్టీలకతీతంగా సంఘటితమవ్వాలని పిలుపునిచ్చారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు



డైరెక్టర్లను సన్మానిస్తున్న రాఘవపూర్‌లో గ్రామస్తులు

యాలాల: ఏఎంసీ(అగ్రికల్చర్ అండ్ మార్కెటింగ్ కమిటీ) తాండూరు పాలకవర్గం సహకారంతో రైతులకు ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని నూతన డైరెక్టర్లు వెల్లడించారు. ఆదివారం మండల పరిధిలోని రాఘవపూర్‌లో నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు మహ్మద్ ముస్తఫా, హరిహరగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు కనీస మద్దతు ధరతో పాటు మెరుగైన వసతుల కల్పనకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, షాబుద్దీన్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి

ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్

షాద్‌నగర్: దళితుల అభ్యున్నతికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎంకనోళ్ల వెంకటేష్ అన్నారు. ఎస్సీ మోర్చా ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు విఠ్యాల నర్సింహ్మ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని దూసకల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటుందన్నారు. దళితులను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రధాని మోడీ అండగా ఉంటున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ దళితులను మోసం చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బంధు పథకాన్ని పార్టీ నేతలకే ఇస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో దళితులు సీఎం కేసీఆర్ ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ఎస్సీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా సంగెం శ్రీకాంత్‌ను ఎన్నుకుని, నియామక పత్రం అందజేశారు.

పార్టీ గెలుపు కోసమే పనిచేస్తాం

- పీసీసీ నిర్ణయించిన వ్యక్తికే తమ మద్దతు
- పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప

యాలాల: పీసీసీ నిర్ణయించిన వ్యక్తి గెలుపు కోసమే తాము పనిచేస్తామని పార్టీ మాజీ మండల అధ్యక్షుడు భీమప్ప అన్నారు. ఆదివారం ఆయన డీసీసీ అధికార ప్రతినిధి రాజశేఖర్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భీమప్ప మాట్లాడుతూ.. తాండూరు కాంగ్రెస్‌కు కంచుకోట.. ఇక్కడ కార్యకర్తల అభిప్రాయం సేకరించకుండానే ఫలానా వారికే టికెట్ ఇవ్వాలని సూచించడం సరికాదన్నారు. రమేశ్ మహరాజ్ ఎన్నికలు సమీపించగానే వేరే వారికి టికెట్ ఇవ్వాలని సూచిస్తూ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. 2018లోనూ రోహిత్‌రెడ్డిని ప్రతిపాదిస్తే పార్టీశ్రేణులు కష్టపడి ఆయనను గెలిపిస్తే ఆయన పార్టీ మారిన విషయం మరిచారా అని ప్రశ్నించారు. స్వలాభం కోసం పార్టీ అభ్యర్థిగా ఫలానా వారిని తీర్మానించాం అని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీ బాధ్యతలు చేపట్టిన వారిని తొలగించి కొత్తవారిని నియమించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా తాము వారి గెలుపునకు పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లప్ప, చంద్రశేఖర్‌గౌడ్, నాగయ్య, గంతల మైనొద్దీన్, శ్రీనివాస్‌చారి, ఖాసీం తదితరులున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అసత్య ప్రచారాలు సరికాదు

బీఆర్‌ఎస్ నాయకుడు రవిశంకర్



మాట్లాడుతున్న రవిశంకర్

అనంతగిరి: తాను యూత్ కాంగ్రెస్ విభాగంలో పని చేస్తూ మోసపోయానే తప్ప తాను ఎవర్నీ మోసం చేయలేదని బీఆర్‌ఎస్ యువ నాయకుడు జొన్నల రవిశంకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం వికారాబాద్ పట్టణానికి సమీపంలోని శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ తన సొంత అవసరాలకు డబ్బులు ఇచ్చారనడం, ఆర్థికంగా సాయం చేశారని పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులన్నీ అవాస్తవమన్నారు. సోషల్ మీడియాలో తనపై ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెట్టి మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ యువజన నాయకులు సురేశ్, సుభాన్‌రెడ్డి, కిషోర్, రాము, గిరీశ్‌కొఠారి, షఫీ, విజయ్ కుమార్, మల్లికార్జున్ , రఘు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించండి



పరిగి: మధ్యాహ్న భోజన కార్మికుల దీక్షలో మారుతికిరణ్



కొడంగల్ రూరల్: ఒంటికాలుపై నిల్చుని నిరసన తెలుపుతున్న కార్మికులు

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్

పరిగి: ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ బూనేటి అన్నారు. ఆదివారం మండల ప్రజాపరిషత్ ఆవరణలో సమ్మె చేస్తున్న మధ్యాహ్నభోజన కార్మికులకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వారికి సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడం సరికాదన్నారు. అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్నా.. ప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు కనీస వేతనంతో పాటు ప్రమాదబీమాను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో జిల్లాలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామకృష్ణ, మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు అలీబాయ్, ఉపాధ్యక్షుడు కన్నయ్యలారాజు, ఆయా గ్రామాల కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.26వేల వేతనం చెల్లించండి

కొడంగల్ రూరల్: పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన వారి నిరసనలు ఆదివారంతో 11రోజులకు చేరాయి. ఒంటి కాలుపై నిలుచుని వారు తమ నిరసన వ్యక్తం చేశారు. వంట ఏజెన్సీ మహిళలకు నెలకు రూ.26వేల వేతనం చెల్లిస్తూ గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి వెంకటలత, నియోజకవర్గ అధ్యక్షురాలు బి.లక్ష్మి ట, కార్మికులు అంజమ్మ, కె.సత్యమ్మ, టి.లక్ష్మి, ఆనందమ్మ, వెంకటమ్మ, రికీబాయ్, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు టికెట్ కేఎల్‌ఆర్‌కే ఇవ్వాలి

- ప్రజల్లోనూ ఆయనకే ఆదరణ
- కాంగ్రెస్ కార్యకర్తల శిబిరంలో సీనియర్ నాయకులు



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ధారాసింగ్

యాలాల: పార్టీకి కష్టకాలంలో అండగా నిలబడిన వ్యక్తి రమేష్ మహారాజ్ అని.. ఆయన సూచించిన కేఎల్‌ఆర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి న్యాయం చేయాలని పార్టీ సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని ఓ ఫంక్షన్ హాలులో యాలాల, బషీరాబాద్ మండలాల కార్యకర్తల శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ గుర్తుతో గెలిచిన ప్రస్తుత ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి పార్టీకి మోసం చేశారన్నారు. ఆయన పార్టీ మారిన అనంతరం నాలుగేళ్లుగా రమేష్ మహారాజ్ నియోజకవర్గంలో పార్టీని, కేడర్‌ను కాపాడుతూ వస్తున్నారన్నారు. సేవా కార్యక్రమాలతో ప్రజల్లో కేఎల్‌ఆర్ గుర్తింపు ఉన్నందున గెలుపు సునాయాసమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ధారాసింగ్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు ఉత్తమ్‌చంద్, జనార్ధన్‌రెడ్డి, బషీరాబాద్, తాండూరు పట్టణ, మండలాల అధ్యక్షులు నర్సింహులు, హబీబ్‌లాల, నాగప్ప, వీరేశం తదితరులున్నారు.



ఉపాధ్యాయులతో 1996-97 బ్యాచ్ మర్పల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

మర్పల్లి: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 1996–97లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంతో కలుసుకున్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పేదరికంతో ఇబ్బంది పడుతున్న స్నేహితులకు ఆర్థికంగా సహకరించి అండగా నిలిచారు. అనంతరం వారికి విద్యాబోధన చేసిన గురువులు సర్దార్‌మియా, సత్యయ్య, రుక్మయ్య, నారాయణ్‌రెడ్డి తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

మంత్రి మహేందర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కేతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో కేతిరెడ్డిపల్లి అయ్యప్ప సొసైటీ ఆధ్వర్యంలో దేవాలయ నిర్మాణానికి మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు కొబ్బరికాయకొట్టి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవాలయాల్లోనే ప్రజలకు మనశాంతి లభిస్తుందన్నారు. మానవుడు మనశాంతికి దేవాలయాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శోభావెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ అర్చన, ఉపసర్పంచ్ సిద్దయ్య, కేతిరెడ్డిపల్లి అయ్యప్ప సొసైటీ సభ్యులు శ్రీశైలం, శ్రీనివాస్, యాదయ్య, యాదయ్య, బాలకృష్ణ, నవీన్‌చారి, ఆర్.శ్రీనివాస్, కృష్ణ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, పథకాలు దేశానికి దిక్సూచి

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కేతిరెడ్డిపల్లిలో సర్పంచ్ శోభ ఆధ్వర్యంలో రూ. 1. 35 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ముఖ్యఅధితులుగా మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పథంలో సాగుతోందని తెలిపారు. ఏ గ్రామంలో చూసినా, ఏ వీధిలో చూసిన రోడ్లు అభివృద్ధి చెందాయన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్, రాష్ట్ర మహిళా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు శోభ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులు మంజూరు చేయడంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ తదితరులు ఎంతో కృషి చేశారని తెలిపారు. సర్పంచ్‌గా నా లక్ష్యం అభివృద్ధే ధ్యేయంగా కేతిరెడ్డిపల్లి గ్రామంలో 90 శాతం రోడ్లు పూర్తయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం జీవంతు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఎంపీటీసీ అర్చన, వెంకటాపూర్ సర్పంచ్ మనోజ్‌కుమార్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుఫ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు నరోత్తమ్ రెడ్డి, నర్సింహ్మారెడ్డి, తిరుపతిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

మున్సిపల్ కార్మికుల డిమాండ్

అనంతగిరి: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు వికారాబాద్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఇతర శాఖల ఉద్యోగులకు పర్మినెంట్ చేస్తున్నట్లు తమను కూడా రెగ్యులరైజ్ చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలన్నారు.



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు